మార్చి 3 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి మూడు నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 3న ఇంగ్లీష్, 5న తెలుగు, ఉర్దూ, హిందీ, 7న రసాయన, ఆర్థిక, సామాజిక శాస్త్రం, 10న భౌతికశాస్త్రం, రాజనీతి, పౌర, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణాంక శాస్త్రం, 15న జీవ, వాణిజ్య వ్యాపార, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి.

రిక్తహస్తం

- బడ్జెట్‌లో సిక్కోలుపై శీతకన్ను
- ఊసే లేని వెనుకబడిన ప్రాంత గ్రాంట్
- న్యూక్లియర్ ఎనర్జీలో ప్రైవేట్‌కు సహకారంపై బడ్జెట్‌లో ప్రస్తావన
- కొవ్వాడ అణు విద్యుత్కేంద్రానికి ఊతమిచ్చేలా ఉన్నాయంటూ చర్చ

టిడిపి మద్దతుపై ఆధారపడిన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, ఆగిపోయిన వెనుకబడిన ప్రాంత నిధులు ఇస్తుందని ఆశించిన ప్రజలకు మళ్లీ నిరాశనే మిగిల్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపింది. సాధారణ కేటాయింపులు మినహా ప్రత్యేకించి నిధులు, ప్రాజెక్టులేవీ లేకపోవడంతో అంతా పెదవి విరుస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ఏడాదికి రూ.50 కోట్ల గ్రాంట్ ఇస్తామని గతేడాది జూలై బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం, ఈసారి అదీ లేదు. జిల్లాకేమీ ఇవ్వకపోగా, ప్రమాదకర అణు విద్యుత్కేంద్రం పనులకు ఊతమిచ్చేలా న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో ప్రైవేట్‌కు సహకారం అందిస్తామంటూ ప్రకటించడంపై అందరిలోనూ ఆందోళన రేగుతోంది. ఆదాయపు పన్ను మినహాయింపులోనూ పెద్దగా ప్రయోజనం లేదని ఉద్యోగులు పెదవివిరుస్తున్నారు. మొత్తమ్మీద కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అన్ని తరగతులనూ అసంతృప్తికి గురిచేసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 3.90 లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి ఆరు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటివరకు అమలు కాలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు ఇప్పటికీ ఆందోళనలు సాగిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం దాని జోలికి వెళ్లలేదు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం సందేహంగానే ఉంది. కందులు, మినుములు కొనుగోలు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం రైతులకు కాస్త ఊరటనిస్తోంది. జిల్లాలో రబీ సీజన్‌లో 60,983 ఎకరాల్లో మినప, ఖరీఫ్‌లో 230 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయి. ప్రభుత్వపరంగా కొనుగోలు లేకపోవడంతో మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కోనసీమ తర్వాత జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు కొబ్బరి పంటను సాగు చేస్తున్నారు. కోకోనట్ బోర్డును ఏర్పాటు చేయాలని చాలాకాలంగా ఉద్దానం రైతులు కోరుతున్నారు. కవిటిలో స్థలసేకరణ కూడా చేపట్టారు. ఆ అంశమూ బడ్జెట్‌లో ప్రస్తావనకు రాలేదు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జీడి పంటకు మద్దతు ధరతో పాటు జీడి బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినా కేంద్ర బడ్జెట్‌లో మాత్రం కనిపించలేదు.

అణు విద్యుత్కేంద్రం పనులకు ఉతమిచ్చేలా ప్రస్తావన

జిల్లాకేమీ ఇవ్వకపోగా, ప్రమాదకర అణు విద్యుత్కేంద్రం పనులకు ఊతమిచ్చేలా వికసిత్ భారత్ 2047లో భాగంగా న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో ప్రైవేట్‌కు సహకారం అందిస్తామంటూ బడ్జెట్‌లో ప్రకటించడంపై ఆందోళన రేగుతోంది. రణస్థలం మండలం కొవ్వాడలో 1208 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు అణు రియాక్టర్ల ఏర్పాటుకు 2017లో టిడిపి హయాంలో 2079 ఎకరాలను సేకరించారు. జిల్లా అధికారులు రూపొందించిన విజన్ 2024-29 డాక్యుమెంట్‌లో జిల్లాలో పారిశ్రామిక, గృహావసరాలకు అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను పొందుపరిచారు. దీంతో ఇప్పటివరకు స్తబ్దుగా ఉన్న అణు విద్యుత్కేంద్రం పనులు మళ్లీ ఊపందుకోనున్నాయనే చర్చ సాగుతోంది.

జిల్లాకు పిఎం ధన్ ధాన్య యోజన దక్కేనా?

రైతుల కోసం దేశవ్యాప్తంగా వంద జిల్లాల్లో పిఎం ధన ధాన్య యోజన పథకం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. తక్కువ ఉత్పాదకత, వెనుకబడిన ప్రాంతం, నీటి సౌకర్యం లేని వెనుబడిన ప్రాంతాల ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాకు ఆ పథకం వచ్చే అవకాశం ఉండవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్న రైతులకు రుణ సౌకర్యాన్ని మాత్రం రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు పెంచింది. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట రుణాలు పొందుతున్న రైతులు 2.90 లక్షల మంది వరకు ఉన్నారు.

ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంత గ్రాంట్

విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంత ప్యాకేజీ కింద రాయలసీమలోని నాలుగు జిల్లాలు, శ్రీకాకుళంతో సహా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు గ్రాంట్ల రూపంలో సాయం అందించనున్నట్లు గతేడాది జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికీ ఆ సాయం అందించకపోగా, ప్రస్తుత బడ్జెట్‌లో కనీసం దాని ప్రస్తావన లేదు.

జిల్లా కేంద్రాస్పత్రికి కేన్సర్ సెంటర్

దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాస్పత్రుల్లో కేన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. జిల్లాలో టెక్కలిలో ఉన్న జిల్లా కేంద్రాస్పత్రిలో సెంటర్ ఏర్పాటు కానుంది. ఇది కార్యాచరణలోకి వస్తే కేన్సర్ పరీక్షలు, చికిత్స కోసం విశాఖతో పాటు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవస్థలు తప్పనున్నాయి.

కొత్త పన్ను విధానంపై వేతనజీవుల పెదవివిరుపు

ఆదాయపు పన్ను పరిమితి విషయంలో ఉద్యోగులు ఆశించినంతగా ఊరట దక్కలేదు. ఉద్యోగులు పొందే మూల వేతనంలో రూ.12 లక్షల వరకు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయించినా పాత శ్లాబులే కొనసాగించడంతో పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఉద్యోగులు పెదవివిరుస్తున్నారు. ఉదాహరణకు ఒక ఉద్యోగి ఏడాదికి రూ.14.50 లక్షల జీతం పొందితే, అందులో కొత్త పన్ను విధానం ప్రకారం రూ.75 వేలను స్టాండర్డ్ డిడక్షన్ కింద మినహాయిస్తారు. మిగిలిన రూ.13.75 లక్షలకు పన్ను వర్తింపజేయనున్నారు. కొత్త విధానం ప్రకారం రూ.నాలుగు లక్షల్లోపు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో దాన్ని మినహాయించి రూ.9.75 లక్షలకు ఆయా శ్లాబ్‌ల ప్రకారం పన్ను మదింపు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో ఇన్సూరెన్స్, ఎల్ఐసి వంటి సేవింగ్స్ తగ్గిపోతాయనే అభిప్రాయం ఉద్యోగుల్లో వినిపిస్తోంది. జిల్లాలో సుమారు 24 వేల మంది ఉద్యోగులు ఉండగా, వారిలో ఐదు వేల మంది వరకు ప్రయోజనం పొందవచ్చని ఉద్యోగ సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు.

మూడు రోజుల పండగకు ముస్తాబు

- రథసప్తమి వేడుకలకు శ్రీకారం
- నేటి నుంచి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు
- ఉచితంగా వీక్షించేందుకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు
- ఆకర్షణగా నిలవనున్న హెలీకాప్టర్ టూరిజం, లేజర్ షో



అరసవల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన సూర్యనారాయణ స్వామి విద్యుద్దీపాల కటౌట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించే రథసప్తమి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పండగగా మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మూడు రోజుల పండగకు పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, క్రీడా కార్యక్రమాలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలిరోజు ఆదివారం ఉదయం ఆరు గంటలకు సామూహిక సూర్య నమస్కారాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిసారిగా హెలీకాప్టర్ టూరిజంను అందుబాటులోకి తెచ్చారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు డచ్ బిల్డింగ్, కలెక్టరేట్ వద్ద హెలీకాప్టర్ రైడ్ ఉంటుంది. గ్రామీణ క్రీడా పోటీలు ఉదయం పది గంటలకు ఎన్.టి.ఆర్ మున్సిపల్ మైదానంలో ప్రారంభమవుతాయి. వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్, పిల్లిమొగ్గలు వంటి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

శోభాయాత్ర

శోభాయాత్ర మధ్యాహ్నం 2.30 గంటలకు డే అండ్ నైట్ జంక్షన్ నుంచి అరసవల్లి ప్రధాన ఆలయం వరకు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్, యామినీ కృష్ణ, పరిమళ, అనురాధ, లక్ష్మీగణపతి శర్మ బృందాలు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. హైపర్ ఆది, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్నీ సాంగ్ ఫేమ్ షణ్ముఖ, సురేష్ రేష్మ, బాలాజీ వంటి ప్రముఖులు ధూంధాం కార్యక్రమంలో పాల్గొంటారు.

ప్రత్యేక ఆకర్షణ కానున్న లేజర్ షో

రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు ఆహూతులను అలరించేలా లేజర్ షో ఏర్పాటు చేశారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి శ్రీ అంజనా కళా సంస్థ ఆధ్వర్యాన పేరొందిన నటీనటులతో పంచరత్నాలు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారు. మయసభ పడక సీను, శ్రీరామాంజనేయ యుద్ధం, భక్త చింతామణి, గయోపాఖ్యానం, శ్రీ సత్యహరిశ్చంద్ర వారణాశి నుంచి ప్రారంభం వంటి నాటకాలను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ఉచితంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

విహారానికి సిద్ధం చేసిన హెలీకాప్టర్

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కోడి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్

ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంచారు. ప్రముఖ, స్థానిక హోటళ్లతో కలిపి అందుబాటు ధరలోనే ఆహార పదార్థాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

3న.. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు హెలీకాప్టరు రైడ్. మున్సిపల్ మైదానంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ముగింపు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు. సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సోఫోన్, సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన గిరిజన నృత్యం, బుర్రకథ, మావుడూరు సత్యనారాయణ శాస్త్రీయ సంగీతం, నీరజా సుబ్రమణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్ బృందాల శాస్త్రీయ నృత్యం, సంప్రదాయ గురుకులం యోగా నృత్యం, 7 గంటలకు లేజర్ షో, 8.15 నుంచి మంగ్లీ టీమ్ సినీ సంగీత విభావరి, రాత్రి 9.30 గంటలకు క్రాకర్స్ షో... రాత్రి 1గంటకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో క్షీరాభిషేకం మొదలు.

4న... అర్ధరాత్రి ఒంటి గంట నుంచి మహాక్షీరాభిషేక సేవ, పట్టువస్త్రాల సమర్పణ, ఉదయం 8 గంటల నుంచి నిజరూప సందర్శన, సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణాలంకరణ సేవ, రాత్రి పవళింపు సేవతో ఉత్సవాల ముగింపు వేడుకలు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు డచ్ బిల్డింగ్ వద్ద హెలీకాప్టర్ రైడ్.

ఆకాశంలో విహారం

హెలీకాప్టర్ రైడ్‌కు రూ.1800

ఈనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు డచ్ భవనం ప్రాంగణంలో హెలీకాప్టర్ విహారానికి ప్రతి ట్రిప్పుకు ఐదు నిమిషాలు, ఒక్కొక్కరికి టికెట్ రూ.1800గా నిర్ణయించారు. రెండేళ్ల లోపు పిల్లలకు ప్రవేశం లేదు. టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో పొందడం తెలియని వారి కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ని ఏర్పాటు చేశారు. టిక్కెట్ కేవలం ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా మాత్రమే చేసుకోవాలి. టిక్కెట్ల బుకింగ్ కోసం heliride.arasavallisungod.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

రథసప్తమి ఏర్పాట్లు పరిశీలన

రథసప్తమి వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. సూర్య నమస్కారాలు నిర్వహించే 80 అడుగుల రోడ్డు వద్ద ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఎస్‌పి సిహెచ్.వివేకానందతో చర్చించి పలు సూచనలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. సిట్టింగ్ ఏర్పాట్లపై జెసి, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూషతో చర్చించి పలు సూచనలు చేశారు.

పటిష్ట బందోబస్తు

రథసప్తమి వేడుకలకు ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. రథసప్తమి వేడుకల భద్రత, బందోబస్తు ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఆలయం లోపల క్యూలైన్లలో ఒకే సమయంలో ఎక్కువ మంది రద్దీ లేకుండా అవసరమైన బారికేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు పార్కింగ్ నిమిత్తం నిర్దేశించిన ఎల్.ఎన్ ఫంక్షన్ హాల్, అరసవల్లి ఎంపియుపి పాఠశాల, వాడాడ జంక్షన్, 80 అడుగుల రహదారి మార్గంలో ఎపిహెచ్‌బి కాలనీ వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి వాహనాలు రాకపోకలకు, పార్కింగ్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐలు, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శి నివేదికపై చర్చల్లో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

ఓర్పు, సహనంతోనే లక్ష్యసాధన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓర్పు, సహనంతోనే లక్ష్యాలను సాధించగలమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో శనివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతకు విజ్ఞానానికి మాత్రమే వాడుకోవాలని, వ్యసనాలకు కాదన్నారు. చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఉంటే స్నేహితులు, తల్లిదండ్రులకు చెప్పడంతో కొంతమేరకు బయటపడవచ్చని చెప్పారు. సమస్యలు ఉంటే నిర్భయంగా, స్వేచ్ఛగా తెలపాలని, సాధ్యాసాధ్యాలు బట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించేందుకు తన ఫోన్ నంబరు 6309990800 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యే సూత్రధారి

- వీడిన హత్య కేసు మిస్టరీ
- వివాహేతర సంబంధమే కారణం
- పది మంది అరెస్టు
- డిఎస్‌పి సిహెచ్.వివేకానంద

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేటకు చెందిన గురుగుబెల్లి చంద్రయ్య హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో భార్యే ప్రియుడితో హత్య చేయించినట్లు డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. ఈ ఘటనలో పది మందిని అరెస్టు చేశామని, ఇందులో ఒకరు మైనర్ అని చెప్పారు. ఈ హత్యలో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. స్థానిక సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. బొబ్బిలిపేటకు చెందిన చంద్రయ్య భార్య ఈశ్వరమ్మకు అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళీకృష్ణతో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. విషయాన్ని తెలుసుకున్న చంద్రయ్య భార్యను మందలించి, సెల్‌ఫోన్ వాడకుండా చేయడంతో పాటు బాలమురళీకృష్ణతో ఉన్న ఆర్థిక లావాదేవీలనూ నిలిపివేశాడు. చంద్రయ్యకు తెలీకుండా వేరే ఫోన్‌తో ఈశ్వరమ్మ, బాలమురళీకృష్ణ మాట్లాడుకునేవారు. చంద్రయ్యను అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశంతో బాలమురళీకృష్ణ తన సోదరుడైన మండలంలోని శ్రీనివాసాచార్యులపేటకు చెందిన గురుగుబెల్లి అరవింద్ సహకారం కోరాడు. అరవింద్ తనకు తెలిసిన బూర్జ మండలం ఉప్పినివలసకు చెందిన వంశీ, గణేష్‌ను పరిచయం చేశాడు. వారితో పాటు అదే గ్రామానికి చెందిన చరణ్ తేజ్, ప్రవీణ్, బొమ్మాళి శ్రీవర్ధన్, బొమ్మాళి ఉమామహేశ్వరరావు, ఈసర్లపేటకు చెందిన యర్లంకి కృష్ణ బొబ్బిలిపేట గ్రామ సమీపంలోని చెరువు వద్ద గత నెల 25న మాటు వేశారు. చంద్రయ్య తన కుమార్తెను ఇంటికి తీసుకొచ్చేందుకు ఆమదాలవలస బయలుదేరినట్లు ఈశ్వరమ్మ బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి చెప్పింది. గ్రామ శివారులో చెరువు వద్ద చంద్రయ్యను అటకాయించి బీరు సీసాతో బలంగా తలపై కొట్టడంతో, వాహనం అదుపు తప్పి మృతుడు కింద పడిపోయాడు. బీరు సీసాలు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి మృతి చెందాడని నిర్ధారించుకున్న తర్వాత మృతదేహాన్ని పక్కనే ఉన్న చెరువులోకి ఈడ్చుకెళ్లి తుప్పల చాటున పడేశారు. అదే రాత్రి ఈశ్వరమ్మ భర్త కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనాస్థలికి దర్యాప్తు చేపట్టారు. హత్య కేసులో ప్రమేయమున్న పది మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించారు.

సూపర్ సిక్స్‌పై మారిన బాబు స్వరం

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అధికారంలోకి వస్తే ఆరు మాసాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడతానని ఎన్నికల ముందు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎనిమిది నెలల తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ బీద అరుపులు అరుస్తున్నారు. తాను ఊహించిన దాని కంటే ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ తప్పును గత ప్రభుత్వంపై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల అమరావతిలో నీతి ఆయోగ్ లెక్కలను పక్కన పెట్టుకుని అప్పులపై మీడియా సమావేశంలో ఏకరువు పెట్టారు. ఎన్నికల హామీలపై తాను ఏమీ చేయలేకపోతున్నట్లుగా నిస్సహాయతను వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలు చేయడం లేదని కొంతమంది ఆలోచన చేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు. డబ్బులు ఉన్నాయి కదా... ఎందుకు అమలు చేయడం లేదని జనం అనుకుంటున్నారని బాబు చెప్పారు. తాను ఒక విజన్ ఉన్న నాయకుడని చెప్పుకునే చంద్రబాబు, ప్రజల్లో అసంతృప్తి గుర్తించినట్లుగా ఉంది. టిడిపి, కూటమి నాయకులకు రకరకాలుగా ఆర్థికంగా మేలు చేకూరేలా నిర్ణయాలు అమలు చేస్తుండడం ఎనిమిది నెలల కాలంలో ఎన్నో చూశాం. వందలాది మందికి నామినేటెడ్ పదవులను కట్టబెట్టారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పుడు వారికి గౌరవ వేతనం, ఇతర ఖర్చుల రూపంలో కోట్లాది రూపాయలను ఖర్చు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. ఆర్థిక పరిస్థితి బాగో లేదనే సాకుతో మేలో మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున ఇవ్వాల్సిన వేట నిషేధ పరిహారాన్ని వాయిదా వేస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇస్తామని చెప్తోంది. 2016-18లో చేపట్టిన నీరు-చెట్టు పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని విజిలెన్స్ విచారణ చేసిన గత వైసిపి ప్రభుత్వం 2019 వరకు బిల్లులను ఆపింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో చెల్లింపులకు రూ.350 కోట్లను విడుదల చేసింది. ఒక్కో అమాత్యునికి సహాయంగా ఐదుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునే వెసులుబాటుతో పాటు సోషల్ మీడియాలో ప్రచారం కోసం మరో ఉద్యోగిని నియమించుకునే అవకాశం కల్పించింది. ఇవన్నీ నిధులు లేకుండానే జరుగుతున్నాయా?

పెట్టుబడులు, పారిశ్రామిక సమ్మిట్‌ల పేరుతో దావోస్ టూర్‌లు, ఢిల్లీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రయాణాలు వంటి అంశాలకు కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి దుబారా చేస్తున్న తీరును మనం చూస్తున్నాం. ఇవి కాక ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల ప్రారంభం, ఇతర ప్రచారాల కోసం కోట్లాది రూపాయాలను వెచ్చిస్తున్న వైనాన్నీ మనం చూస్తున్నాం. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న నిధుల దుబారాను మరిచి గత వైసిపి ప్రభుత్వం అప్పులు చేసి జల్సాలు చేసిందని బాబు చెప్పడం గురివింద గింజ సామెతను గుర్తుకు తెస్తోంది. ప్రజల దగ్గరకొచ్చేసరికి డబ్బులు లేవంటూ బీద అరుపులు అరిస్తే ఎవరు మాత్రం నమ్ముతారు? గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి తొమ్మిదేళ్లు పడుతుందో, పదేళ్లు పడుతుందో తెలియడం లేదని బాబు చెప్తున్నారు. సూపర్ సిక్స్ అమలుకు లేట్ అవుతుందని చెప్పడం ద్వారా టిడిపి కూటమి ప్రభుత్వం కాలంలో సూపర్ సిక్స్ లేనట్టేనని క్లారిటీ ఇచ్చేశారు. సంపద సృష్టించడం ద్వారా ఆదాయం పెంచి ఆ తర్వాతే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తన మనసులోని మాటను చెప్పేశారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విషయంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా స్వరం మార్చారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ఇటీవల వరకు చెప్పుకొచ్చిన మంత్రివర్యులు ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే వచ్చే విద్యా సంవత్సరం నాటికి పోస్టులను భర్తీ చేస్తామంటూ నిరుద్యోగులను ఊరించే ప్రయత్నం చేశారు. ఉద్యోగాల భర్తీ లేక, సంక్షేమ పథకాలు అమలు కాక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నా అదేమీ లేనట్లుగా బాబు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండూ స్థానాలనూ మనమే గెలవాలని నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పట్టభద్రులు ప్రభుత్వం వెంటే ఉన్నారని చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, తొలి సంతకం చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌కు అతీగతి లేని పరిస్థితుల్లో పట్టభద్రులు కూటమి వెంటే ఉంటారని చెప్పుకోవడం అత్యాశే అవుతుంది. ఎన్నికలైన తర్వాత కదా పట్టభద్రులు ఎవరి పక్షమో తేలేది?. ఆ విషయాన్ని బాబు ముందుగానే చెప్పడం పట్టుసడలిపోతున్న నాయకుల్లో విశ్వాసం కలిగించడానికి చెప్పే మాటలుగానే చూడాల్సి ఉంటుంది.

ప్రతి ఎన్నికనూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కూటమి నేతలకు దిశానిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తనయుడు లోకేష్, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్న పట్టుదల మాత్రం కనిపించడం లేదు. ఎన్నికల్లో ఏదో విధంగా అధికారం కైవసం చేసుకునేందుకు నోటికొచ్చిన హామీలను ఇచ్చేయడం, ఆనక వాటిని అమలు చేయడం ఇష్టం లేక అప్పులు, ఆర్థిక పరిస్థితి బాగో లేదంటూ చెప్పడం పాలకులకు పరిపాటే.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A No. 8/2021 in I.P. 14/2015

Between:
M/s Wind Investment Consultancy Pvt. Ltd. (Wind Broking) ....Petitioner/Petitioner.
And:
Manyala Srinivasarao, and others. ......Respondents/Respondents.

To
R7. Dasari Bhanumathi, wife of Rama Rao, aged about 51 years, Hindu, Household duties and Business, resident of Door No. 2-86, Pedda Koviripeta village, Umilada post, Santhabommali mandal, Srikakulam District.

NOTICE

It is to inform you that the above I.A No. 8/2021 in I.P. 14/2015 matter stands posted to on 03-02-2025 for your appearance .Hence you have to appear before the Honourable court on **03-02-2025 at about 10.30 AM.** as in person or through an advocate without fail, otherwise the matter will be decided in your absence.

//By order of the Honourable court//

L.LAKSHMI NARASAMMA
ADVOCATE
Srikakulam

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పవర్‌ప్లాంట్‌పై అపోహలు వద్దు

సరుబుజ్జిలి: నియోజవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ పరిసర ప్రాంతాల్లో ప్రతిపాదించిన జెన్కో క్రిటికల్ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌పై ప్రజలు అపోహలు వీడాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని వీరమల్లి పేట గ్రామం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలు లేక రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయిలో ఉందని అలాగే జిల్లాతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలో కూడా ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సిఎం చంద్రబాబునాయుడుని అభ్యర్థించి ఈ ప్రాంతంలో ఒక పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఆదిలోనే కొంతమంది దీనిని రాజకీయం చేస్తూ ఆ ప్రాంత ప్రజలను తప్పుదోవ పట్టించి అపోహలు సృష్టిస్తున్నారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు నియోజకవర్గ అభివృద్ధితో పాటు భావితరాల భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ దూర దృష్టితో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం జరగనున్న ఈ పవర్ ప్లాంట్ ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు, గిరిజనులకు అన్ని విధాల న్యాయం జరిగిన తర్వాతే పవర్ ప్లాంట్‌పై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజ్ఞావికాస్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం: భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 9, 10 తేదీల్లో పాతపట్నంలో నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు, జిల్లా కమిటీ సభ్యులు ఖగేష్ తెలిపారు. శనివారం పాతపట్నంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ప్రజ్ఞ వికాస్ పరీక్షకు ఎంట్రన్స్ ఫీజు రూ.30 చెల్లించాలని, టెన్త్ క్లాస్ సిలబస్ మొత్తం ఇందులో ఉంటుందని మ్యాథ్స్ 20 మార్కులు, సోషల్ స్టడీస్ 20 మార్కులు, ఇంగ్లీష్ 20 మార్కులు, ఎన్ఎస్ 10 మార్కులు, ఫిజికల్ సైన్స్ 10 మార్కులు, తెలుగు 10 మార్కులు, హిందీ 10 మార్కులు మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు ఎస్ఎఫ్ఐ పోరాటాలే కాకుండా పరీక్షల్లో, చదువుల్లో కూడా ముందుంటామని, విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఎలా రాయాలో తెలియజేయడానికే ఈ పరీక్ష పెడుతున్నామన్నారు.

గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కుమార్ రాజు

గ్రంథాలయానికి వసతులు కల్పిస్తాం

కోటబొమ్మాళి: గ్రంథాలయానికి అన్ని మౌలిక వసతులు కల్పించి పూర్వ వైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి. కుమార్ రాజు అన్నారు. శనివారం శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన గ్రంథాలయ అధికారి మృతి చెందడంతో ఆ స్థానంలో సంతబొమ్మాళి గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణను నియమించడం జరిగిందని, ఆయన ఆదివారం, గురువారం రెండురోజులు ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమంలో గ్రేడ్‌వన్ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కెజిబివిలో సామాజిక తనిఖీ

నందిగాం: మండలంలోని మదనాపురం వద్ద గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకులు, వంటశాల, వంటల నిర్వహణ, మెనూ అమలు విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్తపల్లి జ్యోతి తదితరులున్నారు.

విద్యుత్ ఉపకేంద్రానికి వేస్తున్న సిమెంట్ రోడ్డు

ముమ్మరంగా పల్లె పండగ పనులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సిసి రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. లావేరు పంచాయతీలోని లావేటిపాళెం, జిజివలస, కేశవరాయునిపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నారు. శనివారం చీపురుపల్లి రోడ్డు నుంచి విద్యుత్ ఉపకేంద్రం వరకు వెళ్లే రహదారి సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, త్రినాథ్, రమణ లంకలపల్లి ఆనంద్, రాజేశ్వరరావులు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు.

కుంభమేళాకు ఆర్‌టిసి బస్సులు

టెక్కలి: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు వేయడం జరిగిందని డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క యాత్రికునికి రూ.9,500 చొప్పున టిక్కెట్ వసూలు చేయనున్నామన్నారు. కుంభ మేళాతో పాటు ఒడిశాలో ప్రధాన దేవాలయాల సందర్శన కూడా ఉంటుందని ఫిబ్రవరి 15న బస్సు బయలుదేరుతుందని, వారంరోజుల పాటు జరిగే ఈ ప్రయాణానికి ప్రయాణికులు తమ టిక్కెట్లను బుక్ చేసుకోవాలని మేనేజర్ శ్రీనివాసరావు కోరారు.

మర్రిపాడుకు మంచినీరు కరువు

మారుమూల పల్లెలకు కూడా శుద్ధమైన తాగునీరు అందిస్తామని, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్న పాలకవర్గం తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- **అర్ధాంతరంగా నిలిచిన జలజీవన్ మిషన్ పనులు**
- **చోద్యం చూస్తున్న అధికారులు**

ప్రజాశక్తి- బూర్జ

గ్రామీణ ప్రాంతాల ప్రజలు కలుషిత నీరు సేవించడం వలన వ్యాధులకు గురవుతున్నారని పల్లె ప్రాంతాలకు సైతం శుద్ధమైన తాగునీరు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తుంది. అయితే ఆరంభ శూరత్వం అన్న చందంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కొళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపనలు ఎంతో ఆర్భాటంగా చేసి ఆ తర్వాత చేతులు దులుపుకుంటున్న వైనం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. మండలంలోని పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న మర్రిపాడులో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వేసవి రాకముందే కాదు గత మూడేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటుకు జల జీవన్ మిషన్ ద్వారా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం 2023లో శంకుస్థాపన చేశారు. సుమారు 50 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటుకుగాను రూ.23 లక్షల నిధులను మంజూరు చేశారు. ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ మోటార్ వేయకపోవడం వల్ల కొళాయి ద్వారా తాగునీరు ఇంతవరకు అందలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. వేసిన పైపులైన్లు కూడా ప్రస్తుతం వివిధ దశల్లో వేలాడుతూ ఉన్నాయి. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అప్పట్లో ప్రభుత్వం మూడు బోర్లు ఏర్పాటు చేసింది. అయితే మూడు బోర్లలో కేవలం ఒక్క బోరు మాత్రమే తాగునీటికి ఉపయోగించుకుంటున్నారు. మిగతా రెండు బోర్లలో నీరు కలుషితం కావడంతో రంగు మారి వస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. ఈ నీళ్ల సేవిస్తే వ్యాధుల ప్రబలుతున్నాయని, ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుళాయి కనెక్షన్ చూపిస్తున్న గ్రామస్తుడు

అధికారులు వచ్చి ఈ నీటిని పరీక్షలు జరిపి చేతులు జరుపుకుంటున్నారు తప్ప స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మహిళలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

తాగునీటికి కటకట

గత మూడేళ్లుగా తాగునీటి అవసరాల కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలోనే కాకుండా అన్ని కాలాలల్లోనూ కనీస అవసరాలు

మూలకు చేరిన బోరు

తీర్చుకునేందుకు నీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉన్న ఒక్కగానొక్క బోరు గ్రామంలో అందరికీ చాలకపోవడంతో ఇదే విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నడక కష్టాలు తప్పడం లేదు

అలాగే దశాబ్దాలు క్రితం ఏర్పాటు చేసిన రహదారి పూర్తిగా ఛిద్రమవ్వడంతో రాత్రి సమయంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులకు, పాలకవర్గానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం శూన్యమని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు స్పందించి మోటార్ ఏర్పాటు చేసి ఇంటింటి కొళాయిలు ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు అలాగే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రహదారికి మరమ్మతులు జరిపి నడక కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీరు ఎప్పుడు ఇస్తారో...?

కొళాయిల ద్వారా తాగునీరు ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు, పాలకవర్గం స్పందించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- శాసుబిల్లి వాం్రదంకి పద్మావతి, మర్రిపాడు

అవస్థలు పడుతున్నాం

ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేశారు. తాగునీరు ఇంతవరకు సరఫరా చేయలేదు. నీటి కోసం అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- మంగమ్మ, మర్రిపాడు

పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరం ఎపిటోరియా ఫార్మా పరిశ్రమలో జనవరి 30న కూలింగ్ టవర్ ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా జరిగిన ప్రమాదంలో కార్మికుడు పసుమూర్తి రమేష్ గాయపడ్డారు. విజయనగరం తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని శనివారం సిఐటియు శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, కె.సురేష్ పరామర్శించారు. కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు. కార్మికులు గాయాలపాలవ్వడానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఫార్మా, రసాయన పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, పరిశ్రమలలో కార్మికుల భద్రతకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకపోవడం వలనే తరుచూ ప్రమాదాలు జరగడం, అమాయక కార్మికులు ప్రాణాలు బలైపోవడం, గాయాల పాలవడంతో పాటు అనేక మంది కన్ను, కాళ్లు, చేతులు పోయి క్షతగాత్రులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేయడం, తరువాత యాజమాన్యాల ఇష్టారాజ్యానికి వదిలేయడంతోనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు, భద్రతా ప్రమాణాలు పాటించడంపై యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఇష్టారాజ్యంగా కంపెనీలు నడుపుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించడం లేదని, ఏ కంపెనీలో ఎప్పుడు ఏ రియాక్టర్ పేలుతుందో, ఏ ప్రమాదం జరుగుతుందో, డ్యూటీలకు వెళ్లిన తమ కుటుంబసభ్యులు తిరిగి ఇంటికి వస్తారో? రారో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలు లేక తమ ప్రాణాలను కంపెనీల లాభాల కోసం ఫణంగా పెడుతున్నారని, పరిశ్రమల యాజమాన్యాలు లాభాలే పరమావధిగా భావించడం తప్ప కార్మికుల ప్రాణాలకు విలువనివ్వడం లేదని తెలిపారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో అరబిందో, సరకా, శ్రేయాస్ తదితర పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికులు చనిపోయారని గుర్తు చేశారు. ఫార్మా పరిశ్రమ యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికుల భద్రతకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించాలి

టెక్కలి : ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ప్రజా ఉద్యమాల్లో నిరంతరాయంగా పాల్గొని సమస్యలపై పోరాడుతున్న పిడిఎఫ్ బలపర్చిన అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. నగరంలోని యుటిఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యాన నగరంలోని టిపిఎం స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్, ఎవిఎన్ స్కూల్‌లో విజయగౌరి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరుస్తున్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా ఆమెకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఈ ప్రచారంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పాలకొండ కూర్మారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాష్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ శాంతి ప్రియ, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని సీతారాం, తర్ర వైకుంఠరావు, అర్జున్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ బలపరిచిన విజయ గౌరిని గెలిపించాలని సంఘ నాయకులు కోరారు. ఈ

శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మేరకు శనివారం టెక్కలి పాఠశాలలోనూ, ఉపాధ్యాయుల నివాస గృహాలకు వెళ్లి ఇంటింటా ప్రచారం చేపట్టారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోరెడ్ల విజయ గౌరిని గెలిపించి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి, ఉద్యమ పోరాటాలకు స్ఫూర్తిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కురమాన దాలయ్య, టెక్కలి మండల కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, పాలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జంట పట్టణాల్లో ఫాగింగ్

పలాస: పలాస కాశిబుగ్గ జంట పట్టణంలో ఫాగింగ్ నిర్వహించారు. పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో కెటి రోడ్‌లో వాకింగ్ యంత్రం ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘాలు ఇంటర్నల్ లెండింగ్‌కు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు సూచించారు. సిద్దిగాం గ్రామ సంఘంలో స్వయం సహాయక సంఘ పుస్తక నిర్వహణను పరిశీలించి మాట్లాడారు. సేవింగ్ ఖాతాల్లో నిధులను సభ్యుల అవసరం మేరకు సంఘం తీర్మానం ఆధారంగా పొదుపు నుంచి అప్పులు ఇచ్చుకుని తిరిగి వాయిదాల ప్రకారం వడ్డీతో సహా సంఘం ఖాతాకు జమ చేసుకోవాలని సూచించారు. సంఘం ప్రారంభం నుంచి నేటి వరకు అన్ని సంఘాలను కమ్యూనిటీ ఆడిటర్స్‌తో ఆడిట్ చేయించుకోవాలని వివరించారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ బ్రాండింగ్ నిర్ణయించుకొని వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి డిజిటల్ కామర్స్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఒఎ లక్ష్మీతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, గ్రామ సంఘం ప్రతినిధులు హాజరయ్యారు.

జీవన ధ్రువపత్రాల మంజూరు

టెక్కలి: సంతబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన లైఫ్ సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతుందని విశ్రాంతి ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు శనివారం తెలిపారు. ఈ మేరకు మంచానికే పరిమితమైన విశ్రాంత ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈయనతో పాటు సంఘ నిర్వాహకులు కోరాడ మోహనరావు, ధనుంజయరావు, రెడ్డి మాస్టారు, స్టాలిన్, చిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడే.. హంతకుడు

పలాస: ఇద్దరూ స్నేహితులు.. పక్కపక్క జీడి పరిశ్రమలో పనిచేస్తూ జీడి యాజమాన్యం కేటాయించిన ఇళ్లల్లో నివాసం ఉంటూ కలిసిమెలిసి తిరిగేవారు. ఒకడు అవివాహితుడు. మరొకడు భార్య పిల్లలతో కాపురం చేస్తున్నాడు. ఈ తరుణంలో అవివాహితుడైన స్నేహితుడు తన భార్యతో సన్నిహితంగా ఉండడంతో వీరిద్దరికీ అక్రమ సంబంధం ఉందని అనుమానించాడు. స్నేహితుడితో మంచిగా ఉండి వాడిని హతమార్చాలని భావించి ఇనుప రాడ్డుతో హతమార్చాడు. కాశీబుగ్గ పోలిస్‌స్టేషన్ ఆవరణలో శనివారం డిఎస్‌పి కె.వెంకట అప్పారావు హత్యపై విలేకరులతో మాట్లాడుతూ కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధి కోసంగి పురం ప్రాంతంలో ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో గాయాలతో మృతి చెందాడని సమాచారం రావడంతో ప్రాథమిక దర్యాప్తు చేయగా అది హత్యగా భావించి ఆ కోణంలో దర్యాప్తు చేయగా సాక్ష్యాధారాలు లభించాయని తెలిపారు. మృతుడు పారిశ్రామిక వాడ ప్రాంతంలో జీడీ కార్మికునిగా పనిచేస్తున్న కామిటి శ్రీనివాస్‌గా గుర్తించామన్నారు. కాశీబుగ్గ హరిజన వీధికి చెందిన శ్రీనివాస్ తల్లి నీలమ్మతో కలిసి జీడి యజమాని కేటాయించిన ఇళ్లల్లో నివాసముంటున్నారు. మధ్యప్రదేశ్ జబల్పూర్‌కు చెందిన ఏవేష్ జాన్ మందస మండలం డాల్ కాయ్ గ్రామానికి చెందిన రేవతిని పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలతో పారిశ్రామిక వాడ ప్రాంతంలోనే నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్, జాన్‌లు స్నేహితులు కావడంతో లోడింగ్, అన్ లోడింగ్ పనులకు వెళ్తుండేవారని, ఒకరి ఇంటికి ఒకరు వెళ్తూ

మాట్లాడుతున్న డిఎస్‌పి అప్పారావు

భోజనాలు కూడా కలిసిమెలిసి చేసుకునే సాన్నిహిత్యంతో ఉండేవారని డిఎస్‌పి తెలిపారు. జాన్ భార్యతో శ్రీనివాస్ సన్నిహితంగా ఉండడంతో వీరిద్దరికి అక్రమ సంబంధం ఉందని జాన్ భావించాడని తెలిపారు. ఇది మనసులో ఉంచుకుని అవకాశం దొరికినప్పుడు శ్రీనివాస్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిపారు. గత నెల 24న ఇద్దరు స్నేహితులు కలిసి కోసంగిపురం వైపు వెళ్లి సారా తాగి తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యం జగనన్న కాలనీ వద్ద వాటర్ పైప్ తీసుకుని శ్రీనివాస్‌ను ఎలాగైనా చంపేయాలని ఉద్దేశంతో ఇద్దరు గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు వేసుకుంటూ అదును చూసి జాన్ చేతుల్లో ఉన్న రాడ్డుతో శ్రీనివాస్ ముఖంపైన భుజంపైన తీవ్రంగా గాయపరిచాడు. అప్పటికీ మృతి చెందకపోతే కసి తీరా కొట్టడంతో శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో జాన్ మృతదేహాన్ని వదిలి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారని తెలిపారు. శ్రీనివాస్ తల్లి నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. శనివారం కోసంగిపురం కార్యదర్శి వద్ద ముద్దాయి జాన్ లొంగిపోయి నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. కార్యదర్శి జాన్ పోలీసులకు అప్పగించారని తెలిపారు. ఈ కేసును కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న రాయితీ ఫీజు చెల్లించక విద్యార్థుల చదువులు అగమ్య గోచరంగా మారాయని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 5న వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరుతూ క్యాంపు కార్యాలయంలో శనివారం ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ర్యాలీకి కార్యకర్తలు, నాయకులు విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, ఏనుగుతల సూర్యం, తూలుగు ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించనున్న ఫీజుపోరు పోస్టర్‌ను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆవిష్కరించారు. వైసిపి నాయకులు నాగేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, దుంపల శ్యామలరావు, బద్రి రామారావు, పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్, బి.రమణమూర్తి, ఎస్.రామారావు, మానుకొండ రమణమూర్తి పాల్గొన్నారు.

ఒడియా పాఠశాలల విలీనంపై ఆందోళన

ఇచ్ఛాపురం: ఒడియా పాఠశాలల విలీనం కాకూడదంటే ప్రజా ఉద్యమం తప్పదని తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోవాలని రాష్ట్ర ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబర్ 117 రద్దు అనంతరం పాఠశాలలు సంస్కరణ పేరుతో ఒడియా పాఠశాలలను బలవంతంగా తెలుగు మాధ్యమం పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యా పరమైన ఒప్పందాలు కుదుర్చుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా విద్యార్థులకు ఒడియా మాధ్యమం బోధన, ఒడియా ఉపాధ్యాయుల నియమకం, ఒడియా పుస్తకాల సరఫరా, ఒడియా భాషాభివృద్ధికి అన్ని రకాల సౌకర్యాలు అందిస్తామని, అలాగే ఒడిశాలో నివసిస్తున్న తెలుగు వారికి యధావిధిగా అన్ని రకాల సౌకర్యాలు



మాట్లాడుతున్న సత్యనారాయణ పాడి

అందిస్తామని ఒప్పందాలు కుదుర్చుకున్నారని అన్నారు. ఒడిశాలో విద్యాభ్యాసం చేస్తున్న తెలుగు పిల్లలకు తమ మాతృభాష తెలుగులో చదివే అవకాశం కల్పించడంతో పాటు ద్వితీయ భాషగా పిల్లలు ఎంచుకున్న భాషను చదువుకునే అవకాశంతో పాటు ప్రత్యేకంగా తెలుగు మాధ్యమం డైట్ కళాశాలను గంజాం జిల్లా చికిటిలో స్థాపించారన్నారు. ఒడియా పాఠశాలలను తెలుగు మాధ్యమం పాఠశాలలో విలీనం చేయొద్దని, బెసిక్ ప్రైమరీ, ప్రాథమికోన్నత పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని, 40 మంది ఒడియా పిల్లలు గల ఒడియా ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్ది రాష్ట్రంలో ఒడియా విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒడియా గౌడ సంఘం రఘునాథ గౌడ, శివ ప్రసాద్ పండా, రాజేంద్ర పండా, విద్యాధర బెహెరా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై దాడి కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో బిసి హాస్టల్‌కు చెందిన డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని లక్ష్మిపై దాడి కేసులో పోలీసులు పురోగతి సాదించారు. ఈదాడి ఘటనలో విచారణ చేపట్టిన పట్టణ పోలీసులు 48 గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి కాల్‌డేటా, సీసీ ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టిన పోలీసులకు సినీ పక్కీలో ఆధారాలు చిక్కాయి. నిందుతుడు సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా గాలిస్తుండంగా హిరమండలం వద్ద బస్‌లో ఆ ఫోన్‌ను గుర్తించారు. దీని ఆధారంగా గాలిస్తుండగా వేరొక వ్యక్తి చేతిలో ఫోన్ లభ్యమైంది. అతన్ని పట్టుకుని ఆరా తీయడంతో బస్‌లో దొరికినట్టు ఆయన చెప్పిన మాటలను బట్టి ఫోన్ ఎవరి పేరున ఉందో గుర్తించారు. నిందితుడు సారవకోట మండలం గోవర్ధన పురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి ఆయన తండ్రి నుంచి వివరాలు సేకరించిన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే దాడి ఎందుకు చేశాడన్నది తెలియాల్సి ఉందని, ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నట్టు పోలీసులు చెపుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి వివరాలు బయటకు వస్తాయన్నారు.

దగ్ధమవుతున్న పూరిల్లు

పూరిల్లు దగ్ధం

రణస్థలం: మండలంలోని ఎర్రవరం పంచాయతీ పెద్దయామలపేటలో అగ్ని ప్రమాదం జరిగింది. పూరిల్లు దగ్ధమవ్వడంతో కట్టుబట్టలతో దంపతులు, కుటుంబసభ్యులు నడిరోడ్డునపడ్డారు. శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో బోనెల సోమ్ములుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఇంటిలో ఉన్న నగదుతో పాటు ఇంటిలో ఉన్న సామగ్రి అంతా బూడిదైందని బాధితులు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు బాధితుడు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న రణస్థలం అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపుచేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుము గ్రామానికి చెందిన టిడిపి ఎంపిటిసి వలురౌతు గోవిందరావు కడుము కాలనీలో ఉన్న సర్వే నంబర్ 37/2లో 3 సెంట్లు, 28 /6లో 8సెంట్లు మొత్తం 11 సెంట్లు భూమిలో జీడిపప్పు ఫ్యాక్టరీ, వాటర్ ప్లాంట్ నిర్మాణం చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించి వ్యాపారం చేస్తున్నాడన్న స్థానికుల ఫిర్యాదు మేరకు విఆర్ఒ ఆర్.రాజగోపాలరావు, కార్యదర్శి షావుకారి ఉమారాణి పరిశీలన చేయగ అది ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈ విషయం తహశీల్దార్ రవిచంద్రకు తెలియజేయగా ఆ స్థలం ఖాళీ చేయాలని తహశీల్దార్ ఎంపిటిసికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న ఎంపిటిసి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో విఆర్ఒ, కార్యదర్శి పేర్లతో ఫోర్జరీ సంతకాలు సృష్టించి పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నం చేయగా వారు విఆర్ఒ, కార్యదర్శికి ఫోన్ చేసి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆ సంతకాలు తమవి కావని వారు చెప్పడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. ఈ విషయంపై ఎంపిటిసిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తహశీల్దార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేయనున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న అగ్నికుల క్షత్రియులు

అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కవిటి: నామినేటెడ్ పదవుల్లో అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత కల్పించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గం అగ్నికుల క్షత్రియులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. శనివారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అగ్నికుల క్షత్రియులు కూటమి విజయంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతికి చెందిన అగ్నికుల క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, మరికొద్ది రోజుల్లో ప్రకటించనున్న నామినేటెడ్ పదవుల్లో రెండు పదవులు తమకు కేటాయించాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే అశోక్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంబోట్ల గణపతి, దున్న సత్యం, రెయ్యి సోమేష్, దున్న కుర్మారావు, దున్న లోకేష్, పొల్లాయి సతీష్, తెప్పల మోహనరావు, పొల్లాయి శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ శ్రీరాములు

సమర్థవంతమైన బోధన చేయాలి

పొందూరు: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేలా సమర్థ వంతమైన బోధన చేయాలని ఎంఇఒ జి.శ్రీరాములు అన్నారు. మలకాం ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలతో పాటు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో హెచ్‌ఎం మురళీ మోహనరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరామర్శ

మందస: మండలం జనసేన నాయకులు పందిరి నీలయ్య తండ్రి ఇటీవలే మరణించడంతో స్వగ్రామం రంగనాథపురంలో ఆయన కుటుంబసభ్యులను జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా పరామర్శించి నివాళ్లర్పించారు. ఆయనతో జనసేన నాయకులు సవర శివ, స్వరం రామ పాల్గొన్నారు.

చిత్తడి నేలలతో వరదల నియంత్రణ

పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

చిత్తడి నేలలు వరదలను నియంత్రిస్తాయని, నీటి నాణ్యతను కాపాడతాయని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటరమణ అన్నారు. మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో జాతీయ హరితదళ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్తడి నేలల ఆవశ్యకతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పొడుగునా నీటితోనిండి ఉండే ప్రాంతాలను చిత్తడి ప్రాంతాలుగా గుర్తిస్తారని చెప్పారు. చిత్తడి నేలలు - ప్రకృతి నిధి అని ఇవి జీవవైవిధ్యానికి నిలయమని, వాతావరణ మార్పులతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అటువంటి చిత్తడి నేల కలుషితం చేయకుండా జాగ్రత్త పడడం, కాపాడుకోవడం మనందరి బాధ్యతన్నారు. అనంతరం చిత్తడి నేలలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రాలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, ఈశ్వరరావు, రమేష్, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధనరావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: చిత్తడి నేలల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త పూజారి హరిప్రసన్న అన్నారు. మండలంలోని తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఈ చిత్తడి నేలలు కాపాడుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం బల్ల కంటయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: భూమిపై ప్రాణికోటి మనగడకు చిత్తడి నేలలే మూలమని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-అర్డినేటర్ పూజారి గోవిందరావు పేర్కొన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా బుడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు.
వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు : వైసిపి

పోలాకి : కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను వంచనకు గురిచేసినట్లయిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రాల వారీగా విడుదల చేసిన జాబితాలోనూ ఆంధ్రప్రదేశ్ పేరు లేదని తెలిపారు. కొత్త ప్రాజెక్టులేవీ ప్రకటించలేదు సరికదా.. అమరావతి, మెట్రో రైల్ వంటి కీలకాంశాల గురించి ప్రస్తావించలేదని పేర్కొన్నారు. వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం.. చంద్రబాబు మీదే ఆధారపడి నడుస్తోందంటూ టిడిపి గొప్పల డప్పులు కొట్టుకుంటోందని, ఇప్పుడు చంద్రబాబు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

ఆదాయపు పన్ను తగ్గింపుతో ఊరట

పలాస: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపన్ను తగ్గింపు భారీ ఊరటనిచ్చిందని ఎపి ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. దేశంలో 7.5 కోట్ల ఉద్యోగుల పన్ను తగ్గింపు ద్వారా లక్ష కోట్ల ఆదాయం ప్రభుత్వానికి గండి పడుతుంది. అయినప్పటికీ ఉద్యోగుల పన్ను తగ్గింపు హర్షనీయమన్నారు. గతంలో ఆర్థిక నిపుణులు సూచనలు పాటించే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు..

తిరుపతి రథసప్తమికి కోలాట బృందం

ఇచ్ఛాపురం: మండలం హరిపురం గ్రామానికి చెందిన శ్రీ అసరమ్మ తల్లి కోలాట బృందానికి ఈనెల 4న తిరుపతిలో జరగబోయే రథసప్తమి సూర్యప్రభ వాహన వేడుకల్లో ప్రదర్శనకు అనుమతి లభించింది. 30 మందితో కోలాట బృందం తిరుపతిలో పాల్గొనే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందని కోలాట బృందం గురువు తిప్పన ధనుంజయ రెడ్డి అన్నారు. కోలాట బృందానికి శ్రీమహతి సంస్కృతిక కళాసేవా సంస్థ అధ్యక్షులు, కార్యవర్గం హర్షం వ్యక్తం చేశారు.

మేట్ల తొలగింపుపై వినతి

ఇచ్ఛాపురం: మండలంలో అకారణంగా మేట్లను తొలగించడంపై వైసిపి నాయకులు, ఎంపిపి బోర పుష్ప ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ఉప సంచాలకులు చల్ల శ్రీనివాస రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకులు ఎపిడిని కలిసి మేట్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారని, ప్రస్తుతం పని చేస్తున్న మేట్లు శిక్షణ పొందారని, అన్ని పంచాయతీల్లో ఏకపక్షంగా తొలగిస్తూ కొత్త వారిని నియమించడం దారుణమన్నారు. తొలగించిన మేట్లను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వైసిపి నాయకులు సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, కె.మోహనరావు, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

టెక్కలి: నిత్యం పెరుగుతున్న వాహనాల రద్దీలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలని టెక్కలి ఎంవిఐ సంజీవరావు కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్ కుమార్, కో-ఆర్డినేటర్ వి.ల్యూక్ పాలే, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మా పాఠశాల మా ఊర్లోనే ఉండాలి

ప్రజాశక్తి- కవిటి

ఎన్నో ఏళ్లుగా తమ ఊర్లో ఉన్న ప్రాథమిక పాఠశాల మేపింగ్ పేరుతో బి గొనపపుట్టుగ పాఠశాలలో విలీనం చేయడానికి తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని లొట్టిపుట్టుగ గ్రామస్తులు అన్నారు. శనివారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం లొట్టిపుట్టుగ గ్రామస్తులు మాట్లాడుతూ తమ పాఠశాలలోని 3, 4, 5 తరగతులు బిజి పుట్టుగ పాఠశాలలో విలీనం చేసే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తమ పాఠశాల ఊర్లోనే ఉండాలని వారు స్పష్టం చేశారు. సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ చిన్నారులు ఆ పాఠశాలకు వెళ్లాలని, కూలీ

వినతిపత్రం అందజేస్తున్న లొట్టిపుట్టుగ గ్రామస్తులు

నాలీ చేసుకునే పేద బతుకులకు ఇది కష్టమని వారు తెలిపారు. అధికారులు స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది సంతోష్, సిఆర్‌పి తులసి, గ్రామస్తులు లొట్టి నీలయ్య, పత్రి మాధవరావు, బంజు శ్యాం, లొట్టి ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

మెళియాపుట్టి : ఫ్లెక్సీని తొలగింపజేస్తున్న ఎంపిడిఒ

మెళియాపుట్టి: మండ లంలోని అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. వసుంధర గ్రామంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఆధ్వర్యంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను కార్యదర్శులు దగ్గరుండి తొలగించాలన్నారు.

పలాస : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అలాగే కెటిరోడ్డుపై ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు తొడుగువేసి కప్పారు. రోడ్లపై బ్యానర్లు, ఫెక్సీలు కట్టవద్దని కమిషనర్ ఎన్.రామారావు రాజకీయ పార్టీలకు కోరారు.

పాతపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రెవెన్యూ అధికారులు వివిధ రకాల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. తహశీల్దార్ కరుణ్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలో ఫ్లెక్సీలన్నింటిని తొలగిస్తూ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.

ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపు

ప్రజాశక్తి- కవిటి

ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్ బల్లిపుట్టుగలో సుమారు పదేళ్లు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా సేవలందించి బదిలీ అయిన పత్రి సాయిరాజ్‌ను ఆర్ బల్లిపుట్టుగ గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎస్ వెంకటరావు, సహోపాధ్యాయుడు బల్ల ధర్మారావు మాట్లాడుతూ పత్రి సాయిరాజ్ సాంకేతికత ఉపయోగించి విద్యార్థుల మనసులను రంజింప చేసే విధంగా బోధించిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ

సాయిరాజ్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అధ్యక్షుడు ఈశ్వరరావు, గ్రామ పెద్ద తాతారావు, మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, మొర్రి గోపి, శ్రీరామ్ మూర్తి బిసాయ్, జానకిరావు, హిమ కుమార్, రవి, గ్రామ యువకులు, యువజన సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ వే కోసం నిరసన

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం జనసేన సమన్వయకర్త దాసరి రాజు ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించి శనివారం జనసేన కార్యాలయంలో పోస్టర్‌న ఆవిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురానికి ఆనుకొని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి కోసం ఎందరో నాయకులకు, రైల్వే అధికారులకు కలిసి వినతిపత్రాన్ని ఇచ్చినా ఫలితం లేదని, ఫిబ్రవరి 3న రైల్వే జీఎం వస్తున్న సందర్భంగా బాధిత గ్రామ ప్రజలందరూ పెద్దఎత్తున వచ్చి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, రొకళ్ళ భాస్కరరావు, హేమా చలపతి, రుక్మధరావు, కలియా గౌడ్, శ్యామ్, సుధాకర్, ప్రేమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని నడసంద్ర గ్రామంలో ఉన్న ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రగతిని పరీక్షించారు. హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించే దిశగా ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులందరూ ఖచ్చితంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్ చౌదరి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, రామలక్ష్మి, ధర్మారావు, నాగేశ్వరావు తదితరులున్నారు.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

స్పందించిన అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం, ముచ్చింద్ర గ్రామంలో కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్యకు విద్యుత్ అధికారులు స్పందించి పరిష్కరించడంతో మాజీ సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఇళ్ల మధ్యలో చేతికి అందే ఎత్తులో ఉండటం వలన ఆయా కుటుంబాలు ప్రమాద భయంతో గడిపేవారు. గ్రామానికి వెళ్లి పరిస్థితి గమనించి విద్యుత్‌శాఖ అధికారి పృధ్వీతేజ్‌కి ఫోన్ ద్వారా తెలియజేయడంతో వెంటనే స్పందించి శనివారం మొత్తం కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

అరసవల్లికి జి.ఎన్.వి జ్యూయలరీ విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు నాణ్యమైన బంగారాన్ని అందజేసి వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జిటి రోడ్‌లో జిఎన్‌వి జ్యూయలరీని ఎమ్మెల్యే శంకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలను మించి లోకల్ బ్రాండ్లు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా రథసప్తమి వేడుకల నిర్వహణకు రూ.50 వేల విరాళాన్ని యాజమాన్యం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, జి ఎన్ వి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో వైఎస్ఆర్ కూడలి వద్ద ప్రభుత్వ భూమిలో కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి ఆధ్వర్యంలో అధికారులు ఆక్రమణలు తొలగించారు. స్థానికుల ఫిర్యాదుతో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి వివాద స్థలాన్ని పరిశీలించి పట్టాలు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం జెసిబి సహాయంతో ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేశారు. కాగా గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు తప్పుడు సర్వే నంబర్లతో ఉన్నాయని వాటిని రద్దు చేసి అర్హులకు అందజేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు. కార్యక్రమంలో విఆర్ఒ మంగులు, సర్వేయర్ శివాజీ, సచివాలయ సిబ్బంది, నౌపడ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు